# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారత - రష్యా దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ తో సంభాషించారు.**

2. **ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయాల పవిత్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

3. **విష జ్వరాల నియంత్రణపై పర్య వేక్షించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు.**

4. **తెలంగాణలో సెప్టెంబర్ 17 నుంచి 10 రోజుల పాటు రెండో విడత ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించనున్నామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

5. **కేంద్రప్రభుత్వం ప్రకటించిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు 2024 కు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురు అధ్యాపకులు ఎంపికయ్యారు.**

==========================

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిన్న రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ తో టెలిఫోన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా భారత- రష్యా దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మొదలైన విషయాల్లో తీసుకోవలసిన చర్యలపై కూడా తాము సంభాషించినట్టు ప్రధానమంత్రి సామాజిక మాధ్యమంలో ద్వారా వెల్లడించారు. అనేక ద్వైపాక్షిక అంశాల పురోగతి, భారత్ రష్యాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా చర్చలు జరిపినట్లు తెలిపారు. రష్యా ఉక్రెయిన్ దేశాల మధ్య సంఘర్షణకు శాంతియుతమైన ముగింపు పలకాలన్న భారత్ అభిప్రాయాన్ని పుతిన్ కు వివరించినట్లు నరేంద్ర మోదీ తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి ఆలయంలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయాల పవిత్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో దేవాదాయశాఖపై ఆ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, .భక్తుల మనోభావాలకు ప్రాధాన్యమిస్తూ ఆలయాలను అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. ఆలయాలు అత్యధికంగా పర్యాటక, అటవీ ప్రాంతాల్లో

ఉండటంతో.. వీటి అభివృద్ధికి దేవాదాయ, అటవీ, పర్యాటకశాఖల మంత్రులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆలయ భూముల్లో ఆక్రమణల తొలగింపు, దేవాదాయ ఆస్తుల పరిరక్షణకు ఓ కమిటీ వేసేలా ప్రతిపాదన సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

గిరిజనుల ఆర్థిక సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ అధికారులను ఆదేశించారు. నిన్న ములుగు జిల్లాలో గవర్నర్ పర్యటించారు. ఈ క్రమంలో జిల్లాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఉపయోగించుకునేలా వారికి తగిన ప్రోత్సహం ఇవ్వాలని అధికారులకు సూచించారు. గిరిజనులు ఆర్థికంగా పురోగతి సాధించేంధుకు స్వయం ఉపాధి మార్గాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో సముద్ర విమానాలు –సీ ప్లేన్ విధానాలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. నిన్న అమరావతిలో కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ..సీ ప్లేన్ విధానం ద్వారా ప్రయాణం మరింత సులభతరంగా మారుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విశాఖపట్నం, కాకినాడ, నర్సాపురం తదితర సువిశాల తీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకోనేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. శ్రీశైలం, ప్రకాశం బ్యారేజి, రాజమహేంద్రవరం, నాగార్జునసాగర్ వంటి నదీ పరివాహక ప్రాంతాల్లో సీ ప్లేన్ విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపుతూ

వాయిస్ (33 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో పురపాలక వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు నిన్న విశాఖపట్నంలో స్థానిక ప్రజా ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, కేంద్రం నుంచి వచ్చే నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. విశాఖపట్నం మెట్రోపాలిటన్ ప్రాంత అభివృద్ధి సంస్థ– వీఎమ్ఆర్డీఏ అభివృద్ధికి కొత్త బృహత్ ప్రణాళిక రూపకల్పన రూపొందించడం కోసం సలహా సంఘాన్ని ఏర్పాటు చేయనున్నామని, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల పురోగతికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కానుంది. కాగిత రహితంగా రూపొందించిన ఇ–కేబినెట్ అప్లికేషన్ ద్వారా సమావేశం నిర్వహించనున్నారు. ఇకపై ప్రతి కేబినెట్ సమా వేశం ఇలాగే జరగనుంది. ఇ–కేబినెట్ విధానంలో మంత్రివర్గ ఎజెండా, అన్నీ ఆన్లైన్లోనే అందుబాటులో ఉంటాయి. మంత్రి వర్గ సమావేశం ప్రారంభమవడానికి ముందు ఇ–కేబినెట్ గురించి మంత్రులకు అధి కారులు వివరించనున్నారు. ఇ–కేబినెట్ వల్ల నిర్వహణ, పర్యవేక్షణ సామ ర్థ్యం పెరుగుతుందని, పర్యావరణానికి అనుకూలమని సాధారణ పరిపాలన శాఖ ఒక ప్రకట నలో పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో కాలానుగుణ వ్యాధులు, విషజ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అధికారులను ఆదేశించారు. కాలానుగుణ వ్యాధులపై నిన్న అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విషజ్వరాలు, వ్యాధులపై సమర్థ పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటుచేయాలన్నారు. జ్వరాల నియంత్రణకు కలెక్టర్లు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, ఫాగింగ్ వంటివి సమర్ధవంతంగా అమలు చేయాలని అని సూచించారు. విష జ్వరాల నియంత్రణపై పర్య వేక్షించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

---------------------------

తెలంగాణలో సెప్టెంబర్ 17 నుంచి 10 రోజుల పాటు రెండో విడత ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించనున్నామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ లోని సచివాలయంలో. వైద్యారోగ్యశాఖ ప్రాజెక్టులపై నిన్న ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్య వివరాలతో హెల్త్ ప్రొఫైల్ కార్డులను, రేషన్ కార్డులతో పాటు జారీ చేసేందుకు అవసరమైన వివరాలు సేకరించేందుకు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. జ్వరాలు, డెంగ్యూ, చికున్ గున్యా కేసుల పెరుగుదలపై నివారణ చర్యలు చేపట్టాలన్నారు. తెలంగాణ లోని పట్టణాలు, గ్రామాల్లో దోమల నివారణకు మందులు పిచికారీ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు-2024ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ పురస్కారాలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ఇద్దరేసి చొప్పున నలుగురు అధ్యాపకులు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి గుడివాడ ఎస్‌పీఎస్ పురపాలక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎం. శ్రీనివాసరావు, శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కె సురేష్ ఎంపికవ్వగా తెలంగాణ నుంచి డి సంపత్‌కుమార్, పి ప్రభాకర్‌రెడ్డి ఈ అవార్డులకు ఎంపికయ్యారు. కేంద్ర విద్యాశాఖ ప్రకటించిన ఈ అవార్డులలో దేశవ్యాప్తంగా మొత్తం 50 మంది ఎంపిక కాగా గురుపూజోత్సవం సందర్భంగా సెప్టెంబరు 5న దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో వీరికి ఒక్కొక్కరికి ప్రశంసాపత్రం, రజత పతకం, 50 వేల రూపాయల నగదును అందజేస్తారు.

---------------------------

తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల భర్తీకి సంబంధించి సెప్టెంబరు 1వ తేదీ నుంచి ఐసెట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు కౌన్సెలింగ్ షెడ్యూల్ ను తెలంగాణ ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. రెండు విడతల్లో కౌన్సెలింగ్ ను నిర్వహించనున్నారు. సెప్టెంబరు 1 నుంచి 17వ తేదీ వరకు తొలి విడత, 20 నుంచి 28వ తేదీ వరకు చివరి విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ప్రవేశాల నోటిఫికేషన్, మార్గదర్శకాలను icet.tsche.ac.in వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచినట్లు ఉన్నత విద్యామండలి తెలిపింది.

---------------------------

హైదరబాద్ లో గణేష్ ఉత్సవాల నిర్వహణ విషయంలో అందరి సహకారంతో ముందుకెళ్తామని తెలంగాణ ఐటి శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు తెలిపారు. గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై నిన్న హైదరాబాద్‌లో అన్నిశాఖల అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి మంత్రి సన్నాహక సమావేశం నిర్వహించారు.

=====================